ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 13.07.2025 సమయం 18.10 గంటలు

**ముఖ్యాంశాలు**

1. మహిళా సాధికారత కోసం తమ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.
2. ఇందిరా మహిళా శక్తి సంబరాలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తారు. ఈ నెల 18 వరకు లబ్ధిదారులకు నియోజకవర్గాల వారీగా చెక్కులను పంపిణీ చేస్తారు.
3. సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి బోనాల జాతరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.
4. తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

……………………………………………

**బోనాలు** :

సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి బోనాల జాతరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ ఉన్నారు. రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో ప్రజలందరూ సుఖ,సంతోషాలతో వర్ధిల్లాలని ముఖ్యమంత్రి అమ్మవారిని ప్రార్థించారు. కాగా మహంకాళి బోనాల జాతర ఘనంగా సాగుతోంది. ఆలయం వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఈ రోజు బోనాల సమర్పణ, ఫలహారబండ్ల ఊరేగింపు జరుగుతున్నాయి. ఈ

నెల 14న రంగం, పోతరాజుల గావు, అంబారీపై అమ్మవారి ఊరేగింపు రేపు జరుగుతాయి. ఆలయ పరిసరాల్లో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

డెస్క్

**సింగరేణి:**

సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి కోసం కేటాయించే డీఎంఎఫ్టీ నిధులను ఆ ప్రాంతంలోనే ఖర్చు చేసేలా త్వరలో చట్టం తీసుకువస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. సింగరేణిలో నూతన గనుల ఏర్పాటు కోసం ముఖ్యమంత్రితో చర్చిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మంచిర్యాల జిల్లా జై పూర్ లో అదనంగా 850 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సింగరేణి ఒప్పంద కార్మికుల వేతనాల పెంపు కోసం కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గడిచిన ఏడాది సింగరేణి సంస్థ రికార్డు స్థాయిలో లాభాలు ఆర్జించిందని పేర్కొన్నారు.

డెస్క్

**కోట శ్రీనివాసరావు**

విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాల పాటు తన అద్భుత నటనతో ప్రేక్షకులను ఆయన అలరింపజేశారని మోదీ కొనియాడారు. కోట శ్రీనివాసరావు మృతికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తో పాటు పలువురు సినీ ప్రముఖులు  సంతాపం తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా వెండితెరపై విభిన్నమైన పాత్రల ద్వారా ప్రేక్షకుల హృదయాలను కోట శ్రీనివాసరావు గెలుచుకున్నారని కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అంతకుముందు ఆయన ఇంటి నుంచి మొదలైన అంతిమయాత్రలో పలువురు సినీ ప్రముఖులు అభిమానులు పాల్గొన్నారు. కాగా కోట శ్రీనివాసరావు అంత్యక్రియలు హైదరాబాద్  ఫిలింనగర్లోని మహాప్రస్థానంలో కుటుంబ సభ్యులు అభిమానుల వీడ్కోలు మధ్య ఈరోజు సాయంత్రం ముగిసాయి. డెస్క్

**ప్రమోషన్స్**

రాష్ట్రంలోని 81 మంది జూనియర్ లెక్చరర్లకు ప్రిన్సిపాళ్లు గా ప్రమోషన్స్ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ నాంపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో రేపు వీరికి కౌన్సిలింగ్ నిర్వహిస్తారు.

డెస్క్

**ఓదెల కోర్టు:**

పెద్దపల్లి జిల్లా, ఓదెలలో నూతనంగా జూనియర్ సివిల్ కోర్టు ప్రారంభించటం వల్ల ప్రజల సమీపంలోకే సత్వర న్యాయం అందే అవకాశాలు మెరుగవుతాయని రాష్ట్ర హై కోర్టు జడ్జి , పెద్దపెల్లి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కే. లక్ష్మణ్ అన్నారు. పెద్దపల్లి జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో అనేక కేసులు పెండింగ్ లో ఉన్నాయని, న్యాయవ్యవస్థలో ఉన్న పెండింగ్ కేసుల పరిష్కారానికి మౌలిక వసతుల మెరుగుదల, నూతన కోర్టుల ఏర్పాటు వంటి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

పెద్దపల్లి పీటీసీ

**యాదగిరిగుట్ట**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామిని ఈ రోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్, సమాచార, ప్రజాసంబంధాల శాఖ మంత్రి కె. పార్థ సారథి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి ఎస్. వెంకట్రావ్ మంత్రి కుటుంబానికి దర్శనం ఏర్పాట్లు చేశారు. మంత్రి దంపతులకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు.

పీ టీ సీ యాదాద్రి భువనగిరి

**వాతావరణం**

తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ములుగు, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ –మల్కాజ్ గిరి, మెదక్, సంగారెడ్డి

జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది.అన్ని జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీయవచ్చని పేర్కొంది.

డెస్క్

**బిఎస్ఎస్ఎల్**

హైదరాబాద్ మహానగర పరిధిలో మూడో వంతు పైగా బిఎస్ఎన్ఎల్ మొబైల్ టవర్లను 4జికి అప్ గ్రేడ్  చేసినట్లు ఆ సంస్థ హైదరాబాద్ సిజిఎం చంద్రమౌళి తెలిపారు. కొత్తగా 2430 సైట్లు ఏర్పాటు చేసే ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు. Transmission నెట్వర్క్ ను అత్యధిక మెట్రో అగ్రిగేషన్ ఆక్సిస్ నెట్వర్క్ ద్వారా విస్తృతం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

డెస్క్

**500 నోట్లు**

ఏటీఎంలలో 500 రూపాయల నోట్లు ఉంచడాన్ని  నిలిపివేయాలని ఆర్బిఐ కోరినట్లు వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఇందులో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. 500 రూపాయల నోట్లు చట్టబద్ధంగా చలామణిలో కొనసాగుతాయని పేర్కొంది.

డెస్క్

**ఎలక్షన్ కమీషన్**

సుప్రీం కోర్టు అనుమతితో బీహార్ లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను భారత ఎన్నికల సంఘం చేపడుతోంది. ఇదే విధంగా దేశవ్యాప్తంగా నిర్వహించేందుకు ఎలక్షన్ కమీషన్ ప్రణాళికలను రూపొందిస్తుంది. వచ్చే నెలలో ఈ ప్రక్రియను నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల అధికారులతో ఎన్నికల కమీషన్ సంప్రదింపులు జరుపుతోంది. దీనిద్వారా విదేశీ అక్రమ వలసదారులను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తారు. బీహార్ లో జరుగుతున్న ప్రత్యేక సవరణలో నేపాల్, బంగ్లాదేశ్, మయన్మార్ దేశాలకు చెందిన పౌరులను పెద్ద సంఖ్యలో గుర్తించారు.  ఈ వ్యక్తులు ఆధార్, నివాస ధృవ పత్రం, రేషన్ కార్డ్ లతో సహా అన్ని పత్రాలను పొందగలిగారని వెల్లడైనట్లు ఎన్నికల సంఘం వర్గాలు తెలిపాయి.

డెస్క్

**మంచిర్యాల**

మహిళా సాధికారత కోసం తమ ప్రభుత్వం అనేక పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళలు సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం తగిన సహకారం అందిస్తోందని ఆయన అన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడం ద్వారా కుటుంబాలు అన్ని విధాలుగా బలోపేతం అవుతాయని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లా పర్యటన లో భాగంగా రెబ్బన్ పల్లె లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు.. ప్రాణహిత, చేవేళ్ళ ప్రాజెక్టు పూర్తి చేసి ఉమ్మడి  అదిలాబాద్ జిల్లా రైతాంగానికి న్యాయం చేస్తామన్నారు.

పిటిసీ, మంచిర్యాల జిల్లా....

**మెదక్ :**

రైతులు పంటల యాజమాన్య పద్ధతులను సమగ్రంగా పాటిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని  మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఈ రోజు మెదక్ మండలం పేరూరు గ్రామంలో రైతుల పొలాలను కలెక్టర్ పరిశీలించారు. నిరంతర విద్యుత్ సరఫరా, యూరియా, ఇతర పురుగు మందుల సరఫరా గురించి రైతులను ఆయన అడిగి తెలుసుకున్నారు.

పిటిసి, మెదక్

**ఇందిరా మహిళా శక్తి**

ఇందిరా మహిళా శక్తి సంబరాలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తారు. ఈ నెల 18 వరకు లబ్ధిదారులకు నియోజకవర్గాల వారీగా చెక్కులను పంపిణీ చేయనున్నారు. దీనివల్ల సకాలంలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందే వెసులుబాటు కలుగుతుందని పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. 25 వేల కోట్ల రూపాయలకు తగ్గకుండా మహిళా సంఘాలకు రుణాలు అందిస్తామని ఆమె వెల్లడించారు. డెస్క్

**రేషన్ కార్డులు....**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు సూర్యాపేట జిల్లా, తిరుమలగిరి లో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుడతారు. ఆహార భద్రతలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రెండో దశలో రేపు3 లక్షల 58 వేలకు పైగా కొత్త రేషన్ కార్డుల ను జారీ చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే సభలో రెండో దశ కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభమవుతుందని మంత్రి తెలిపారు.

డెస్క్, పిటిసి నల్లగొండ

**ఖమ్మం – పామాయల్**

రైతుసంక్షేమానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈరోజు సత్తుపల్లి మండలంలో పామాయిల్ తోటలను మంత్రి పరిశీలించారు. పిటిసి